
## OPERATION SINDOOR


పహల్గాంలో నరమేధం సృష్టించిన పాకిస్థాన్‌కు భారత్ దిమ్మతిరిగే సమాధానం ఇచ్చింది. 26 మంది అమాయకులను ఊచకోత కోసిన ఉగ్రమూకల పీకను భారత త్రివిధ దళాలు తుదముట్టించాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక భారత సైనికదళాలు జరిపిన మెరుపు దాడిలో పాక్ ఉగ్ర శిబిరాలు నేలమట్టం అయ్యాయి. దీనిపై క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌తో మొదలుపెడితే సెహ్వాగ్, యువరాజ్‌సింగ్, ధవన్, విజేందర్‌సింగ్, యోగేశ్వర్‌దత్, నిఖత్‌జరీన్ సోషల్‌మీడియా వేదికలుగా త్రివిధ దళాల శౌర్య పరాక్రమాలను ప్రశంసించాయి.




భయం లేని సమిష్టితత్వం. పరిమితులు లేని శక్తి. భారత్‌కు ప్రజలే ఎనలేని బలం. ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు లేదు. మేమంతా ఒక టీమ్. జై హింద్. **- సచిన్ టెండూల్కర్**



ఎవరైనా మీ పై రాళ్లు విసిరితే..పూలతో పాటు కుండీలను కూడా విసిరేయండి. **- సెహ్వాగ్**




ఉగ్రవాదాన్ని తుదిముట్టించేందుకు భారత్ దీటుగా సమాధానం చెబుతుంది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. భారత్ మాతాకీ జై. **-శిఖర్ ధవన్**



'మన దేశం యొక్క బలం మన ప్రజల సమిష్టితత్వమే. ఏదైతే సరైనదో దాన్ని కాపాడుకోవాల్సిందే. దేశంగా కలిసి ఉండటమే కాదు, ఒక జట్టుగా శాంతికి భంగం కల్గించే వాటిని సమిష్టిగా ఎదుర్కొందాం. ఈ ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు లేదు. భారత్ ప్రతీసారి పుంజుకుంటుంది, సమిష్టితత్వాన్ని చాటుతుంది. జై హింద్. **-యువరాజ్‌సింగ్**




మన సైనికులు బెదిరించరు, దీటుగా సమాధానం చెబుతారు. మన హీరోల శక్తి, సామర్థ్యాలు ఏంటో ఆపరేషన్ సిందూర్ ద్వారా చూపించారు. **- నిఖత్ జరీన్**



భారత్‌తో పాటు ప్రపంచంలో ఉగ్రవాదానికి చోటు లేదు. పాకిస్థాన్ ఉగ్రమూకల అంతుచూసిన భారత త్రివిధ దళాలకు అభినందనలు. భారత్‌పై ఎవరైనా దాడి చేయాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించేలా సమాధానమిచ్చారు. జై హింద్. **- పీటీ ఉష**

# టెస్టులకు రోహిత్ టాటా


**అనూహ్యంగా వీడ్కోలు పలికిన హిట్‌మ్యాన్ • వన్డేల్లో కెప్టెన్‌గా కొనసాగింపు**



న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో అలజడి! స్టార్ క్రికెటర్ రోహిత్‌శర్మ..టెస్టు కెరీర్‌కు అనూహ్యంగా వీడ్కోలు పలికాడు. గత కొన్ని రోజులుగా వెలువడుతున్న వార్తలకు చెక్ పెడుతూ సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకుంటున్నట్లు హిట్‌మ్యాన్ బుధవారం ప్రకటించాడు. ఇంగ్లండ్‌తో కీలకమైన టెస్టు సిరీస్‌కు ముందు తన నిర్ణయాన్ని ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో పడేశాడు. టెస్టుల్లో గత కొన్ని నెలలుగా నిలకడలేమితో సతమతమవుతున్న రోహిత్ తన నిర్ణయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. 'హలో అందరికి. టెస్టులకు వీడ్కోలు పలుకుతున్న విషయం మీకు చెప్పదల్చుకున్నాను. టెస్టుల్లో దేశం తరపున ప్రాతినిధ్యం వహించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇన్నేండ్లుగా మీరు చూపించిన ప్రేమకు కృతజ్ఞతలు. వన్డేలో భారత్ తరఫున కొనసాగుతాను' అని తన టెస్టు క్యాప్‌తో ఫొటో పోస్ట్ చేశాడు. తన టెస్టు కెరీర్‌లో 67 మ్యాచ్‌లాడిన రోహిత్ 40.57 సగటుతో 4301 పరుగులు చేశాడు. ఇందులో 12 సెంచరీలు, 18 అర్ధసెంచరీలు ఉన్నాయి. 212 పరుగులు హిట్‌మ్యాన్‌కు అత్యధిక స్కోరు. ఇదిలా ఉంటే ఇంగ్లండ్‌తో సిరీస్‌కు కొత్త కెప్టెన్ ఎవరన్న దానిపై ఆసక్తి నెలకొన్నది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని గిల్‌కు పగ్గాలు అప్పగిస్తారా..లేక బుమ్రాను నియమిస్తారా అన్నది తేలాల్సి ఉంది. రోహిత్ వీడ్కోలుతో టీమ్‌ఇండియా ఇప్పుడు మూడు ఫార్మాట్లలో ముగ్గురు కెప్టెన్లు కొనసాగనున్నారు. భారత క్రికెట్‌లో ఇది తొలిసారి కావడం విశేషం.

# కేకేఆర్ ఖేల్ ఖతం!

**ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరి • చెన్నై చేతిలో ఓటమి • నూర్ అహ్మద్, బ్రెవిస్ విజృంభణ**




కోల్‌కతా: ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసు మరింత రసవత్తరంగా మారింది. మ్యాచ్ మ్యాచ్‌కు సమీకరణాలు మారుతూనే ఉన్నాయి. గెలిస్తే గానీ రేసులో నిలువలేని పరిస్థితుల్లో డిఫెండింగ్ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) సత్తాచాటడంలో విఫలమైంది. ఫలితంగా ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత సంక్లిష్టం చేసుకుంది. సొంత ఇలాఖాలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్‌పై చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) 2 వికెట్ల తేడాతో అద్భుత విజయం సాధించింది. ఇప్పటికే రేసు నుంచి నిష్క్రమించిన సీఎస్‌కే వెళుతూ..వెళుతూ కోల్‌కతా అవకాశాలకు ఘోరంగా గండికొట్టింది. ఆడుతున్నది చెన్నై చెపాక్‌లోనా అన్నట్లు ఈడెన్ గార్డెన్స్ పసుపు రంగు జెర్సీలతో కొత్త రంగు పులుముకున్నది. లీగ్‌లో ఇప్పటి వరకు 12 మ్యాచ్‌లాడిన కేకేఆర్ ఐదింటిలో గెలిచి, ఆరింటిలో ఓడి ప్రస్తుతం 6వ స్థానంలో కొనసాగుతున్నది. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా..మిగతా జట్ల గెలుపు, ఓటములపై కేకేఆర్ ప్లేఆఫ్స్ అవకాశాలు ఆధారపడి ఉంటాయి. ఇక చెన్నై విషయానికొస్తే 2018 తర్వాత 180కి పైగా పరుగుల లక్ష్యాన్ని తొలిసారి ఛేదించిన చెన్నై...ఈ సీజన్‌లో మూడో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. మ్యాచ్ విషయానికొస్తే తొలుత నూర్ అహ్మద్(4/31) ధాటికి కోల్‌కతా 20 ఓవర్లలో 179/6 స్కోరు చేసింది. కెప్టెన్ రహానే(33 బంతుల్లో 48, 4ఫోర్లు, 2సిక్స్‌లు), రస్సెల్(21 బంతుల్లో 38, 4ఫోర్లు, 3సిక్స్‌లు), మనీశ్‌పాండే(36 నాటౌట్) రాణించారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన చెన్నై 19.4 ఓవర్లలో 183/8 స్కోరు చేసింది. బ్రెవిస్(25 బంతుల్లో 52, 4ఫోర్లు, 4సిక్స్‌లు) సుడిగాలి అర్ధసెంచరీతో చెలరేగగా, శివమ్ దూబే(45) విలువ చాటుకున్నాడు. వైభవ్ అరోరా(3/48)మూడు వికెట్లు తీయగా, రానా(2/43), వరుణ్(2/18) రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

**నూర్ కమాల్:**

టాస్ గెలిచిన కోల్‌కతా..బ్యాటింగ్ ఎంచుకుంది. సొంతగడ్డపై పడుతూ లేస్తూ సాగుతున్న కేకేఆర్‌కు మెరుగైన శుభారంభం దక్కలేదు. రెహ్మానుల్లా గుర్బాజ్(11) మరోమారు విఫలం కాగా, సునీల్ నరైన్(26), రహానే(48) ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. వీరిద్దరు కలిసి చెన్నై బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ బౌండరీలతో ఆకట్టుకున్నారు. అశ్విన్ వేసిన ఐదో ఓవర్‌లో నరైన్ రెండు ఫోర్లకు తోడు సిక్స్‌తో చెలరేగడంతో 14 పరుగులు వచ్చాయి. మరో ఎండ్‌లో కంబోజ్‌ను లక్ష్యంగా చేసుకుంటూ రహానే 6, 4 కొట్టడంతో పవర్‌ప్లే ముగిసే సరికి కేకేఆర్ 67/1 స్కోరు చేసింది. అయితే స్పిన్నర్ నూర్ అహ్మద్ రంగప్రవేశంతో సీన్ పూర్తిగా మారిపోయింది. ఇన్నింగ్స్ 8వ ఓవర్‌లో నూర్ అహ్మద్..నరైన్‌తో పాటు రఘువంశీ(1)ని ఔట్ చేసి కోల్‌కతాను కష్టాల్లోకి నెట్టాడు. ఇక్కడ్నుంచి కోల్‌కతా ఇన్నింగ్స్ నెమ్మదించింది. ఇదే అదునుగా రహానే కూడా ఔట్ కావడంతో కోల్‌కతాను మరింత దెబ్బతీసింది. రస్సెల్..తనదైన శైలిలో బ్యాటు ఝులిపించడంతో మళ్లీ గాడిలో పడింది. ఇక ఫర్వాలేదనుకుంటున్న తరుణంలో నూర్ అహ్మద్..రస్సెల్‌ను ఔట్ చేసి చెన్నై శిబిరంలో ఆనందం నింపాడు. భారీ షాట్లు ఆడుతాడనుకున్న రింకూసింగ్(9) కూడా నూర్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..మనీశ్ పాండే విలువైన ఇన్నింగ్స్‌తో కోల్‌కతాకు పోరాడే స్కోరు దక్కింది.

**బ్రెవిస్ ధనాధన్:**

లక్ష్యఛేదనలో చెన్నై ఓపెనర్లు అయూశ్ మాత్రే(0), డెవాన్ కాన్వే(0) సున్నాలు చుట్టారు. దీంతో 25 పరుగులకే చెన్నై ఓపెనర్ల వికెట్లు కోల్పోయింది. అరంగేట్రం కుర్రాడు ఉర్విల్ పటేల్(11 బంతుల్లో 31, ఫోర్, 4సిక్స్‌లు) ఉరుములా విరుచుకుపడ్డాడు. ఆడుతున్నది తొలి మ్యాచ్ అయినా వెరవకుండా కోల్‌కతా బౌలర్లను చితక్కొట్టాడు. భారీ షాట్ ఆడే క్రమంలో రానా బౌలింగ్‌లో మూడో వికెట్‌గా వెనుదిరిగాడు. అశ్విన్(8) ఇలా వచ్చి అలా వెళ్లాడు. దీంతో చెన్నై ఓటమి ఇక ఖాయమనుకుంటున్న తరుణంలో బ్రెవిస్ ధనాధాన్ ఇన్నింగ్స్‌తో దుమ్మురేపాడు. అరోరా వేసిన 11వ ఓవర్‌లో బ్రెవిస్ మూడు సిక్స్‌లు, మూడు ఫోర్లతో 22 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. దీంతో సమీకరణం మొత్తం మారిపోయింది. బ్రెవిస్ ఔటైనా..దూబే కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆఖర్లో కెప్టెన్ ధోనీ(17 నాటౌట్) ఫినిషర్ పాత్ర పోషించాడు.

### సంక్షిప్త స్కోర్లు

**కోల్‌కతా:** 20 ఓవర్లలో 179/6(రహానే 48, రస్సెల్ 38, నూర్ అహ్మద్ 4/31, జడేజా 1/34), **చెన్నై:** 19.4 ఓవర్లలో 183/8(బ్రెవిస్ 52, దూబే 45, అరోరా 3/48, వరుణ్ 2/18)

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 11 | 8 | 3 | 0 | 16 | 0.79 |
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.48 |
| పంజాబ్ | 11 | 7 | 3 | 1 | 15 | 0.37 |
| ముంబై | 12 | 7 | 5 | 0 | 14 | 1.15 |
| ఢిల్లీ | 11 | 6 | 4 | 1 | 13 | 0.36 |
| కోల్‌కతా | 12 | 5 | 6 | 1 | 11 | 0.19 |
| లక్నో | 11 | 5 | 6 | 0 | 10 | -0.46 |
| హైదరాబాద్ X | 11 | 3 | 7 | 1 | 7 | -1.19 |
| రాజస్థాన్ X | 12 | 3 | 9 | 0 | 6 | -0.71 |
| చెన్నై X | 12 | 3 | 9 | 0 | 6 | -0.99 |

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# ఫైనల్లో భారత జట్లు

**సత్తాచాటిన చికిత ఆర్చరీ ప్రపంచకప్ టోర్నీ**





షాంఘై: చైనా వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నీలో భారత మహిళల, పురుషుల కాంపౌండ్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఒజాస్ దియోతలె, అభిషేక్ వర్మ, రిషబ్ యాదవ్‌తో కూడిన భారత ఆర్చరీ త్రయం సెమీఫైనల్లో 232-231 తేడాతో డెన్మార్క్‌పై అద్భుత విజయం సాధించింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో మన జట్టు 239-232తో బ్రిటన్‌ను ఓడించింది. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీస్‌లో మధుర ధామన్‌గావోంకర్, చికిత తానిపర్తి, వెన్నెం జ్యోతిసురేఖ త్రయం 232-230తో బ్రిటన్‌పై గెలిచి ఫైనల్లో మెక్సికోతో పోరుకు సిద్ధమైంది. పురుషుల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో అభిషేక్ వర్మ, రిషబ్ యాదవ్ వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో నిలిచారు. మహిళల కాంపౌండ్ కేటగిరీలో మధురకు మూడో స్థానం దక్కింది. అభిషేక్, మధురతో కూడిన కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది.

# సుహాస్‌కు రజతం

**ఖేలో ఇండియా యూత్ గేమ్స్**




హైదరాబాద్, ఆట ప్రతినిధి: గయా(బీహార్) వేదికగా జరుగుతున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ పతక జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన పురుషుల 50మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ పోటీలో రాష్ట్ర యువ స్విమ్మర్ మైలారి సుహాస్ ప్రీతమ్ 27:68సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజత పతకం కైవసం చేసుకున్నాడు. ఇదే విభాగంలో అర్జున్‌సింగ్(హర్యానా), వేదాంత్‌చంద్ర(ఉత్తర్‌ప్రదేశ్) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల 400మీటర్ల వ్యక్తిగత మెడ్లె ఈవెంట్‌లో శ్రీనిత్య సాగి 5:20:81సెకన్ల టైమింగ్‌తో కాంస్యం దక్కించుకుంది. మరోవైపు 200మీటర్ల సైక్లింగ్ స్ప్రింట్ ఈవెంట్‌లో తనీశ్‌కుమార్ కాంస్యం ఖాతాలో వేసుకున్నాడు.



# జెమీమా సూపర్ సెంచరీ

**• దక్షిణాఫ్రికాపై విజయంతో ఫైనల్లో భారత్**

కొలంబో: మహిళల ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 23 పరుగుల తేడాతో విజయం సాధించి శ్రీలంకతో ఫైనల్ పోరుకు సిద్ధమైంది. తొలుత జెమీమా రోడ్రిగ్స్(101 బంతుల్లో 123, 15ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీకి తోడు దీప్తిశర్మ(93), స్మృతి మంధన(51) అర్ధసెంచరీలతో టీమ్‌ఇండియా 50 ఓవర్లలో 337/9 స్కోరు చేసింది. 9 పరుగులకే ఓపెనర్ ప్రతికా రావల్(1) నిష్క్రమించగా, మంధన, రోడ్రిగ్స్ ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశారు. వన్డేల్లో రెండో సెంచరీ ఖాతాలో వేసుకున్న రోడ్రిగ్స్ కీలకమైన భాగస్వామ్యాలతో జట్టుకు భారీ స్కోరు అందించింది. లక్ష్యఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 314/7 స్కోరు చేసింది. డెర్క్సెన్ (81), ట్రయన్ (67) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. అమన్‌జ్యోత్‌కౌర్ (3/59), దీప్తిశర్మ (2/57) రాణించారు.

# అఫ్జల్ కన్నుమూత



హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత వెటరన్ ఫుట్‌బాల్ ప్లేయర్ డీఎమ్‌కే అఫ్జల్ బుధవారం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న అఫ్జల్ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు. గురువారం అంత్యక్రియలు జరుగనున్నాయి. 1962 ఆసియా క్రీడల్లో భారత ఫుట్‌బాల్ జట్టు స్వర్ణం సాధించడంలో అఫ్జల్ కీలకంగా వ్యవహరించారు. అఫ్జల్ మృతికి తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో పాటు సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి సంతాపం ప్రకటించారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.